క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 11 కేవీ ఆదిత్యా నగర్ ఫీడర్‌ల కింద ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్యనగర్, జయసూర్య పట్నం, లక్ష్మీనగర్, బీబీఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ గ్రామం, ఎస్‌బీఆర్ కాలనీ, సాయిదుర్గా కాలనీ, సాయిహోమ్స్, టీచర్స్ కాలనీ, టీచర్స్ గ్రిల్డ్ కాలనీ, రాజలక్ష్మి, శ్రీ రాజలక్ష్మి కాలనీ, మ్యాట్రిక్స్ రిచ్ కాలనీలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు గుర్రంగూడ ఏరియాలోని పోస్టల్ కాలనీ, గోల్డ్ ఫేజ్ కాలనీ, జక్కిడి శక్తిరెడ్డి కాలనీ, సావిత్రి అమ్మకాలనీ, బాబిర్ రెడ్డి కాలనీ, వేంకటేశ్వర కాలనీ, శ్రీనివాసపురం కాలనీ, గాద్వి ఎన్‌క్లేవ్, వినాయకనగర్, శ్రీకృష్ణ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, బృందావనం కాలనీలో ఆటంకం కలగనుందన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నాయకులు

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను వేయకూడదని మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహా రెడ్డి అన్నారు. గురువారం జాతీయ రహదారికి ఇరువైపులా పంచాయతీ సిబ్బంది చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. వానాకాలం అందులో సీజనల్ వ్యాధుల కాలమని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే దోమలు, ఈగలకు నిలయంగా మారుతుందని, తద్వారా రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉందన్నారు. జీపీ సిబ్బంది కూడా.. ప్రజలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. వార్డు మాజీ సభ్యుడు మల్లయ్య, నాయకులు అశోక్, ప్రవీణ్ ఉన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ


బ్యాగులతో చిన్నారులు తదితరులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ముర్తుజపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం యూత్ ఫర్ సేవ ప్రతినిధి కడారి శ్రీశైలం ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయురాలు బిందుమాధవి, స్థానికులు శ్రీనివాస్, రాజు, కురుమయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినులకు శిక్షణ శిబిరం



శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినులు, గర్ల్స్ ప్రతినిధులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులలో శారీరక, మానసిక, సామాజిక అవగాహన పెంపుకోసం హర్ వాయిస్ పరిచయ్ పేరుతో పది రోజుల పాటు వాయిస్ ఫర్ గర్ల్స్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గోపాల్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు జ్యోతి, శాంభవి, కీర్తి, సంతోషి, అస్మ, పద్మ, వాయిస్ ఫర్ గరల్స్ కో ఆర్డినేటర్ స్పందన, కీర్తన, వేద, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం హైదరాబాద్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మాజీ సర్పంచ్ శ్రీశైలం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య బృందం శివిద్య, జ్యోత్స్న, నర్సింగ్ సిబ్బంది, నాయకులు శ్రీను, బలరాజు, అంజయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల నెరవేరింది


రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి (ఫైల్)

- అందిన కొత్త రేషన్ కార్డులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్హులు
- పట్నం మండలంలో గతంలో 18,397 కార్డులు
- కొత్తగా వచ్చినవి 1,820
- పేర్లు చేర్చడానికి అందిన దరఖాస్తులు 3,624

ఇబ్రహీంపట్నం రూరల్: కొత్త రేషన్ కార్డుల కల నెరవేరింది. పుష్కర కాలం అనంతరం తెలంగాణలో ఆహార భద్రత కార్డుల పంపిణీ ప్రక్రియ ఊపందుకుంది. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ కార్డులు జారీ కాలేదు. ప్రస్తుతం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కొత్త కార్డులకు మోక్షం లభించిందని అర్హులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పదేళ్ల తర్వాత

ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీలు, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటికీ రెండు మున్సిపాలిటీలు, ఇబ్రహీంపట్నం మండలంలో కలిపి 18,397 రేషన్ కార్డులు ఉన్నాయి. గడిచిన కాలంలో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. కొత్తగా ఎవరికీ కార్డులు ఇవ్వలేదు. వాటికోసం అర్హులైన వారు రెవెన్యూ, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారు.

కొత్తగా 1,393 కార్డులు

ఇబ్రహీంపట్నం మండలంలో గతంలో 18,397 కార్డులు ఉండగా, కొత్తగా 1,820 కార్డులను నిన్నటి వరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అర్హులకు అందజేశారు. కార్డుల్లో పేర్లు లేని వారు, పిల్లల పేర్లు నమోదు కాని వారు 3,624 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆమోదంతో పాటు జిల్లా పౌరసరఫరాల శాఖ అంగీకారం చేయడానికి ఏకంగా అర్హులు కలెక్టరేట్‌కు వెళ్లి పనులు చేయించుకుంటున్నారు.

సంక్షేమ ప్రభుత్వం

తెలంగాణ అనంతరం రేషన్ కార్డుల కోసం అర్హులు కళ్లు కాయలు కాసేలా చూశారు. అయినప్పటికీ.. నాటి ప్రభుత్వం ఏ ఒక్కరికీ కార్డు ఇవ్వలేదు. ఆ ప్రభుత్వం చేయని పని కాంగ్రెస్ సర్కార్ చేసి చూపించింది. అర్హులందరికీ కార్డులు జారీ చేసింది. సంక్షేమ ప్రభుత్వంగా నిలిచింది.

– నరాల విజయ్‌కుమార్, శేరిగూడ

సంతోషంగా ఉంది



మాకు వివాహం జరిగి ఆరేళ్లు పూర్తయ్యింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. రేషన్ కార్డు లేక ఇబ్బంది పడేవారం. అందరికీ ఉండి, మాకు లేకపోయే సరికి ఏదోలా అనిపించేది. ఇప్పుడు ఆ సమస్య తీరింది. అందరిపేర్లతో కూడిన కార్డు వచ్చింది. సంతోషంగా ఉంది.

– సీహెచ్ శిరీష, కప్పపహాడ్

నాడు వైఎస్.. నేడు రేవంత్



ఉమ్మడి రాష్ట్రంలో దివంగత నేత, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందజేసింది. ఈ మధ్య కాలంలో తెలంగాణను పాలించిన పాలకులు ప్రజలను మోసం చేశారు.

– కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్

సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక చేనేత


రాట్నం తిప్పుతున్న విద్యార్థులు

హయత్‌నగర్: చేనేత వస్త్రధారణ ఆరోగ్యానికి మంచిదని, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వదేశంలో తయారైన ఖాదీ, చేనేత దుస్తులను ప్రతిఒక్కరూ ధరించాలని సూచించారు. ఇవి ఏ కాలంలోనైనా రక్షణగా ఉంటాయని తెలిపారు. వాటిని వినియోగించి, చేనేత కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాట్నం తిప్పి, ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరి మధు, గిరిధర్‌గౌడ్, సంజైరెడ్డి, నవితేజరెడ్డి, ప్రముఖ పాఠశాలల చైర్మన్ రాధాకృష్ణ, డైరెక్టర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..


ఆమనగల్లు: కొండా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పద్మశాలీలు

ఆమనగల్లు: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, పురుషోత్తం, సత్యనారాయణ, ఆనంద్, బుచ్చయ్య, వెంకటేశ్, యాదయ్య, తిరుపతయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంకు సన్మానం

మంచాల: ఏపీఎంగా శేఖర్ గౌడ్ గురువారం మహిళ సమాఖ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన శోభ.. మాడ్గుల మండలానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో మేడ్చల్ మండల కేంద్రంలో విధులు నిర్వహించిన శేఖర్ ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండల నాయకులు బాలరాజ్, మల్లయ్య, సత్తయ్య, మల్లేశ్‌లు నూతన ఏపీఎంను ఘనంగా సన్మానించారు.


శేఖర్ గౌడ్‌ను సన్మానించిన వికలాంగుల సంఘం నాయకులు

నేతలకు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

- సబితారెడ్డికి ప్రొటోకాల్ ఇప్పుడు గుర్తుకొచ్చిందా?
- నియోజకవర్గ అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: వలస వచ్చిన నేతలకు కుర్చీల కొట్లాట తప్పా మహేశ్వరం అభివృద్ధిపై ధ్యాసలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు టి.యాదిశ్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి వలస వచ్చి ఎమ్మెల్యే సబితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌లు నియోజకవర్గ అభివృద్ధిని మరిచిపోయి ప్రొటోకాల్ అంటూ కుర్చీల కోసం కొట్లాడుకోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గ ప్రజలు సబితారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇప్పటివరకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా, ప్రజలు ఇబ్బంది పడితే తనకేమిటనే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సబితారెడ్డికి ఎమ్మెల్యేగా బాధ్యత లేదా ప్రశ్నించారు. రేషన్‌కార్డుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించలేదని గగ్గోలు పెడుతున్న సబితారెడ్డి.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీజేపీ చైర్మన్, కౌన్సిలర్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, కాంగ్రెస్ మేయర్‌లకు ప్రొటోకాల్ పాటించకుండా వారిని ఇబ్బందులకు గురిచేసిన రోజులు మరిచిపోయావా సబితమ్మ అని గుర్తుచేశారు. మీ వ్యక్తిగత రాజకీయాల కోసం మహేశ్వరం నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సబితా రెడ్డి, కేఎల్లార్‌లకు హితవు పలికారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంపీ నిధుల కింద మహేశ్వరం, కందుకూరు మండలాలకు అభివృద్ధి పనులకు రూ.1.25 కోట్ల నిధులు మంజురయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కోటి 52 లక్షల ఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి శ్రీధర్ బాబు విడుదల కాకుండా నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బస్వ పాపయ్యగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, పార్లమెంట్ కో–కన్వీనర్ అనంతయ్యగౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్‌యాదవ్, నాయకులు రఘుపతిగౌడ్, శ్రావణ్, పంతునాయక్, శ్రీరాములు యాదవ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో భారీ వర్షం

ఉక్కపోతకు ఉపశమనం

ఇబ్రహీంపట్నం: అడపాదడపా పడుతున్న వర్షాలతో అన్నదాతలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఎండలు మండుతున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం అరగంటకు పైగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ఊరట కలిగింది. ఇబ్రహీంపట్నంలో సాయంత్రం 7 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొంగరకలాన్‌లో 50.3 మి.మీటర్లు, ఎల్మినేడులో 36.5 మి.మి, పట్నంలో 20.8 మి.మి, మంగల్‌పల్లి 9.3 మి.మి, దండుమైలారంలో 1.6 మి.మి. వర్షపాతం నమోదైయింది. ఈ సీజన్‌లో సరైన స్థాయిలో వానలు పడకపోవడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. రానున్న రోజుల్లో మరిన్ని భారీ వర్షాలు కురిస్తేనే తాగు, సాగునీటి లోటు తీరనుంది.

ఆలయ హుండీ లెక్కింపు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీని గురువారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 78 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.1 లక్షా 45 వేల 233లు వచ్చినట్లు ఈఓ తెలిపారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మంచాల: స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల వారీగా ఓటర్లను గుర్తించాలని సూచించారు. తప్పులు లేకుండా, ఇంటి నంబర్ల ఆధారంగా లిస్టును తయారు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, సూపరింటెండెంట్ అబ్దుల్‌అజీమ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై నైపుణ్యం పెంచుకోవాలి

ఎంఈఓ సత్యనారాయణ



గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎంఈఓ

కడ్తాల్: గ్రంథాలయాలతో విద్యార్థులు పుస్తక పఠనంపై నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో లైబ్రరీని ప్రారంభించి మాట్లాడారు. లైబ్రరీ ద్వారా చిత్రలేఖనం, నీతి కథలు, హాస్య కథలు, జంతువుల జీవన విధానం, చిత్రకథలు, జాతీయ, అంతర్జాతీయ నాయకుల జీవిత విశేషాలు, చరిత్ర, వీరనారీమణుల గురించి తెలుసుకోవచ్చునని తెలిపారు. పోటీ పరీక్షలకు బాసటగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం అరుణ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రజాక్, ఉపాధ్యాయులు మల్లయ్య, బీఎస్‌ఎన్ మూర్తి, జంగయ్య, జ్యోతి, సాయివాణి, సంగీత తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోండి

అబ్దుల్లాపూర్‌మెట్: తలసేమియా వ్యాధి గ్రస్తులకు 15 నుంచి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఈ చికిత్స ఖరీదుతో కూడుకున్నది అని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. వైద్య సదుపాయాన్ని ఉచితంగా ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో అందిస్తున్నారని తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో వ్యాధి గురించి ఆశలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడారు. తలసేమియాతో పాటు రక్తహీనతతో బాధపడుతున్న వారు కామినేని వారి వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కామినేని రూపొందించిన బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఆశ వర్కర్స్ సూపర్‌వైజర్స్ అలివేలు, జానకమ్మ కామినేని ప్రతినిధులు యాదగిరి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, ఆశావర్కర్లు

పాత బస్టాండ్‌కు ఆర్టీసీ బస్సులు


డ్రైవర్‌కు సూచనలు చేస్తున్న కంట్రోలర్

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: 'ప్రయాణికులున్నా.. బస్సులు రాక' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. హైదరాబాద్–ఇబ్రహీంపట్నంకు నడిచే సబర్బన్, మెట్రో సర్వీసులు పాత బస్టాండ్‌కు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప.. అంబేడ్కర్ కూడలిలో కంట్రోలర్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు పాతబస్తీకి బస్సులను తిప్పాలని డ్రైవర్లకు సూచనలు చేస్తున్నారు. ప్రజల రవాణా కష్టాలను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినందుకు 'సాక్షి'కి బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.


ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

ఆప్యాయతల రక్షా బంధన్

సోదర సోదరీమణుల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచిన రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. వరుస సెలవుల నేపథ్యంలో ముందస్తుగా గురువారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు తదితర ప్రాంతాల ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి వారికి విద్యార్థులు రాఖీ కట్టారు.


ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థులు


అబ్దుల్లాపూర్‌మెట్‌లో..


ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ సునీతారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి హేమలత

హై'టెన్షన్' పెట్టవద్దు

- మా బతుకులు ఆగం చేయొద్దు
- ఆందోళన వ్యక్తంచేసిన రైతులు
- 765 కేవీ విద్యుత్‌లైన్ మార్చాలంటూ డిమాండ్
- బడా నేతలతో అధికారులు చేతులు కలిపారంటూ ఆరోపణ



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల్: 'సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూములపై నుంచి హైటెన్షన్ విద్యుత్‌లైన్‌ను తీసి, మా బతుకులను ఆగం చేయవద్దు' అని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం మండల కేంద్రంలో శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ బాధిత రైతులు ధర్నా, రాస్తారోకో చేశారు. వీరికి స్థానిక నాయకులు మద్దతుగా నిలిచారు. అనంతరం పలువురు మాట్లాడారు. బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ కంపెనీ అథార్టీతో.. బళ్లారి నుంచి మీర్ఖాన్‌పేట్ వరకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్, కడ్తాల్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల వ్యవసాయ పొలాల మీదుగా తప్పుడు అలైన్‌మెంట్‌తో తీస్తున్న లైన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బడా బాబులతో చేతులు కలిపి..

ఆదాని గ్రూప్‌నకు సంబంధించిన సెంట్రల్ సోలార్ పవర్ విద్యుత్ ప్రాజెక్టు, బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ కంపెనీతో తీస్తున్న లైన్.. అలైన్‌మెంట్ రూట్ సరైంది కాదని, మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు నుంచి తీయాల్సి ఉందని రైతులు పేర్కొన్నారు. సంస్థ అధికారులు.. బడా బాబులతో కుమ్మక్కై రూటు ఇక్కడికి మార్చారని ఆరోపించారు. కడ్తాల్ మండలంలో 200 సర్వే నంబర్లలో సుమారు 500 మంది రైతుల పొలాల మీదుగా విద్యుత్ లైన్ మార్కింగ్ చేశారని తెలిపారు. ఆ భూములన్నీ ఎకరం, రెండు ఎకరాలలో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న చిన్న సన్నకారు రైతులవేనని వివరించారు. అభివృద్ధి చెందిన మండలంలో.. బహిరంగ మార్కెట్‌లో ఎకరం భూమి రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లు పలుకుతుందని, అక్రమంగా విద్యుత్ లైన్ తీయడం వలన రైతులందరూ నష్టపోతారని వాపోయారు. వెంటనే అలైన్‌మెంట్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.